
జన్మదిన వేడుకలు జరపకండి : దేవెగౌడ

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): తన జన్మదిన వేడుకలను ఎవరూ జరుపరాదని మాజీ ప్రధాని దేవెగౌడ గురువారం ప్రకటించారు. ఈనెల 18న దేవెగౌడ 92వ ఏటలోకి అడుగుపెట్టనున్నారు. కొన్ని కారణాల వలన జన్మదిన వేడుకలను జరుపుకోవడం లేదని స్పష్టం చేశారు. దేవెగౌడ కుమారుడు ఎమ్మెల్యే రేవణ్ణ జైలు నుంచి రెండురోజుల కిందటే విడుదలయ్యారు. మనవడు, ఎంపీ ప్రజ్వల్ దేశం వీడి పరారీలో ఉన్న విషయం తెలిసిందే. హాసన్‌లోని ఇళ్ళు, కార్యాలయాల్లో సిట్ సోదాలు సాగిస్తోంది. ఇటువంటి తరుణంలో వేడుకలు జరుపుకోవడం సముచితం కాదని రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది.

టెన్షన్.. టెన్షన్

- ఎన్నికల ఫలితాలపై నేతల్లో గుబులు
- కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం..
- బీజేపీ సీనియర్లకు అగ్ని పరీక్షే...







బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా లోక్‌సభ ఎన్నికలపై ఆసక్తి అంతగా ఉండదు. అయితే ఈ సారి ఎన్నికలు మాత్రం రాష్ట్ర రాజకీయాల దశ దిశ మార్చేసేలా ఉన్నాయి. 28 లోక్‌సభ స్థానాలకు రెండు విడతల్లో పోలింగ్ సాగింది. మూడు నాలుగు దశాబ్దాల రాష్ట్ర రాజకీయంలో జాతీయ పార్టీ కాంగ్రెస్, బీజేపీలకు స్పష్టమైన మెజారిటీ రాకుంటే ప్రాంతీయ జేడీఎస్ పార్టీ మద్దతు ఇచ్చేది . కానీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీ, జేడీఎస్‌లు పొత్తుతో ముందుకెళ్లాయి. ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్, కాంగ్రెస్ ప్రముఖ నాయకులకు ఎన్నో సంబంధాలు, అనుబంధాలు ముడిపడి ఉన్నాయి. రెండు విడతల పోలింగ్ ముగియడంతో ఫలితాలు మావైపు అంటూ ఎవరి ధీమాలో వారు ఉన్నారు.

- అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కేవలం ఒక స్థానాన్ని మాత్రమే అది కూడా ప్రస్తుత డీసీఎం డీకే శివకుమార్ తమ్ముడు డీకే సురేశ్ రూపంలో దక్కింది. అప్పట్లో కాంగ్రెస్ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఉండేది. అయినా బీజేపీ 25 స్థానాల్లో విజయం సాధించింది. జేడీఎస్‌లో హాసన్ నుంచి ప్రజ్వల్ రేవణ్ణ ఒక్కరే గెలుపొందారు. ఇక పార్టీ జాతీయ నేత దేవెగౌడ సైతం అప్పటి ఎన్నికల్లో ఓటమి చెందినవారే.

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ 15-20 స్థానాల్లో గెలుపు సాధిస్తామనే ధీమాలో ఉన్నారు. అయితే ఏమాత్రం సీట్లు తక్కువైనా రాష్ట్ర రాజకీయాల్లో కలకలం తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచే ప్రభుత్వాన్ని కూల్చే కుట్రసాగుతోందని స్వయంగా సీఎం పలుమార్లు వెల్లడించారు. తాజాగా మహారాష్ట్ర సీఎం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సీఎం పదవి కోసం డీసీఎం డీకే శివకుమార్ ప్రయత్నాలు సాగిస్తున్నట్లు పార్టీలో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ సీట్లు తగ్గితే సీఎం, డీసీఎంల మధ్య విబేధాలు తలెత్తినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. మరోవైపు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత నియోజకవర్గం కలబురగి నుంచి పోటీ చేసిన అల్లుడు గెలుపోటములు ఆయనపైనా ప్రభావం చూపనున్నాయి.

- మరోవైపు బీజేపీ అగ్రనేత యడియూరప్ప కుటుంబానికి ఇదో కీలకమైన సవాల్ లాంటిది. యడియూరప్ప దగ్గరుండి ఎన్నికలను పర్యవేక్షించారు. ఆయన పెద్ద కుమారుడు శివమొగ్గ అభ్యర్థి కాగా రెండో కుమారుడు విజయేంద్ర పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ సీట్లు తగ్గితే విజయేంద్రపై వేటు పడనుందనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో యడియూరప్ప వ్యతిరేక వర్గం ఆచితూచి వ్యవహరిస్తోంది. మరోవైపు మైసూరు నుంచి యువరాజు యదువీర్, బెంగళూరు గ్రామీణ నుంచి పద్మశ్రీ డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ల గెలుపోటములు కీలకం కానున్నాయి.

మంత్రుల మనుగడ ఏం కానుందో..

ఏడాది కిందట తిరుగులేని మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థుల విజయం బాధ్యత మంత్రులపైనే ఉంచారు. మీరు అభ్యర్థిని ఎంపిక చేయండి లేదా మీ కుటుంబీకులకైనా సరే అనే సంకేతంతో ఏకంగా 8మంది వారసులను అభ్యర్థులుగా బరిలోకి దింపారు. మంత్రులు రామలింగారెడ్డి, మహదేవప్ప, శివానంద పాటిల్, లక్ష్మీ హెబ్బాళ్కర్, సతీశ్ జార్కిహొళి, ఈశ్వర్ ఖండ్రెలతోపాటు దావణగెరెలో మంత్రి మల్లికార్జున భార్యను అభ్యర్థి చేయగా శివమొగ్గలో మధు బంగారప్ప అక్క గీతాను అభ్యర్థిని చేశారు. ఇక డీకే శివకుమార్ తమ్ముడు మరోసారి బరిలో ఉన్న విషయం తెలిసిందే. తమ కుటుంబ సభ్యులను గెలిపించాల్సిన బాధ్యత మీద పడడంతో మంత్రులు ప్రచారంలో చెమటోడ్చారు.

ఇద్దరు మాజీ సీఎంలు గట్టెక్కేరా..?



లోక్‌సభ ఎన్నికల్లో మాజీ సీఎంలు ఇద్దరు బరిలోకి దిగారు. జగదీశ్ శెట్టర్, బసవరాజ్ బొమ్మైల అదృష్టం కూడా వారి విజయంపైనే ఉంది. ఇక సీనియర్ నేత సోమణ్ణకు ఇదో అగ్ని పరీక్షగా ఉంది. శాసనసభ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోవడంతో రాజకీయంగా నిరుద్యోగిని చేశారని మండిపడ్డారు. ఆయన తుమకూరు నుంచి పోటీ చేసి అదృష్టం కోసం వేచి ఉన్నారు. ఇలా ప్రతిపార్టీకి, అభ్యర్థికి ఎన్నికలు కీలకమయ్యాయి. ఇక అందరి దృష్టి జూన్4 పైనే ఉంది.

రేవణ్ణకు నేటి మధ్యాహ్నం వరకు మధ్యంతర బెయిల్

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): లైంగిక దౌర్జన్యాల కేసులో మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. ఈ కేసులో అరెస్టు భయం ఎదుర్కొంటున్న రేవణ్ణ బెయిల్‌పిటీషన్ దాఖలు చేశారు. గురువారం విచారణ చేపట్టిన బెంగళూరు 42వ ఏసీఎంఎం కోర్టు శుక్రవారం మధ్యాహ్నం వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది 5లక్షల రూపాయల బాండ్ సమర్పించాలని సూచించింది. రేవణ్ణ నివాసంలో పనిచేస్తున్న 47ఏళ్ల మహిళ రేవణ్ణ, ఆయన కుమారుడు ఎంపీ ప్రజ్వల్‌లపై హాసన్ హొళెనరసీపుర పోలీస్ స్టేషన్‌లో ఏప్రిల్ 28న లైంగిక వేధింపుల ఫిర్యాదు చేసింది. గురువారం రేవణ్ణ బెయిల్ కోరుతూ కోర్టుకు పిటీషన్ దాఖలు చేయగా ఇందుకు సంబంధించి సిట్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.



- పోలీసుల నిర్లక్ష్యంపై అంజలి తల్లిదండ్రుల ఆగ్రహం
- హంతకుడిని ఎన్‌కౌంటర్ చేయాలి : దింగాలేశ్వర స్వామి
- కుటుంబసభ్యులకు పరామర్శ
- రాష్ట్రానికి యోగి లాంటి సీఎం కావాలి
- నేహా తండ్రి నిరంజన్ హిరేమఠ్

ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదు..!

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ చేతిలో దారుణంగా హత్యకు గురైన అంజలి హత్యలో పోలీసులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హత్యకు గురైన అంజలిని వారం నుంచే హంతకుడు గిరీష్ బెదిరించేవాడు. తనను నన్ను ప్రేమించకుండా నిర్లక్ష్యం చేస్తే నేహా హత్య తరహాలోనే దారుణంగా చంపేస్తానని హెచ్చరించారు. ఇదే విషయమై భయపడిన అంజలితో పాటు అవ్వ, చెల్లెలు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భయం కలుగుతోందని ఎప్పుడు హత్య చేస్తారో అంటూ పోలీసులకు వివరించగా అటువంటిదేమీ జరుగదని మీరు ఇంటికి వెళ్ళండి అంటూ సర్ది చెప్పిన విషయం వెలుగులోకి వచ్చింది. నిర్లక్ష్యం చేసినట్లు భావించిన ఉన్నతాధికారులు ఇన్‌స్పెక్టర్ సీబీ చిక్కోడి, కానిస్టేబుల్ రేఖా ఇద్దరినీ సస్పెండ్ చేశారు.



అంజలికుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దింగాలేశ్వరస్వామి

యోగి లాంటి సీఎం కావాలి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్న వేళ అదే పార్టీకి చెందిన కార్పొరేటర్, ఇటీవల హత్యకు గురైన విద్యార్థిని తండ్రి నేహాహిరమఠ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకకు ఉత్తరప్రదేశ్ సీఎం యోగీ ఆదిత్యనాథ్ వంటి శక్తివంతమైన ముఖ్యమంత్రి కావాలన్నారు. హుబ్బళిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలు దారి తప్పాయన్నారు. ప్రతి చోటా యువకులు గంజా, డ్రగ్స్ వాడుతున్నారన్నారు. ఇక్కడి పోలీసులు కనీస స్థాయిలో కూడా చర్యలు తీసుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. గతంలో హైదరాబాద్‌లోను ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోను యువతులను కిరాతకంగా వేధించిన వారిని ఎన్‌కౌంటర్ చేసిన తరహాలోనే ధైర్యం ఉండే వారు కావాలన్నారు. సీఎం యోగీ ఆదిత్యనాథ్ వంటి వారు కర్ణాటకకు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇటీవలే నేహా హత్య జరిగింది. అది మరువక ముందే ఏకంగా యువతి ఇంటికే వెళ్ళి నిద్రిస్తున్న యువతిని దారుణంగా హత్య చేశారంటే ఎంతకు తెగించి ఉంటారన్నారు. నిరంజన్ హిరేమఠ్ కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోనే అంజలి దారుణహత్య జరిగింది. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా కనీస చర్యలు తీసుకోని పోలీసు కమిషనర్ నిర్లక్ష్యమే హత్యలకు కారణమన్నారు. హుబ్బళిలో శాంతిభద్రలు దారి తప్పాయన్నారు.

దింగాలేశ్వరస్వామిజీ పరామర్శ

కాగా అంజలిను హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ శిరహట్టి ఫకీరేశ్వర మఠం దింగాలేశ్వర స్వామిజీ మండిపడ్డారు. అంజలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వెంటనే తగిన చర్యలు తీసుకోని పక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థిని నేహా హిరేమఠ, అంజలిని హత్యచేసిన నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. అంజలి హత్యకు ముందే ప్రాణాలకు ప్రమాదం ఉందని ఫిర్యాదు చేసినా పట్టించు కోకపోవడం దారుణమని మండిపడ్డారు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల పర్వం

- 54మంది.. 85 నామినేషన్లు

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆరు స్థానాలకు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల చివరి రోజు హోరాహోరీగా నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం దాకా నామినేషన్ల సందడి కనిపించింది. 54మంది అభ్యర్థులు 85 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ఈశాన్య పట్టభద్రుల స్థానానికి అత్యధికంగా 24 నామినేషన్ల సెట్లు వేశారు. బీజేపీ నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఒకరు, జేడీఎస్ నుంచి ఒకరు నామినేషన్ వేయగా గుర్తింపులేని రాజకీయ పార్టీలనుంచి 7 నామినేషన్లు దాఖలు కాగా 44మంది ఇండిపెండెంట్లు దాఖలు చేశారు. బీజేపీ నుంచి ఐదుగురు, బీజేపీ నుంచి ఐదుగురు, కాంగ్రెస్ నుంచి ఆరుగురు, జేడీఎస్ నుంచి ఇద్దరు నామినేషన్లు వేయగా గుర్తింపు లేని రాజకీయ పార్టీలనుంచి ఏడుగురు, ఇండిపెండెంట్లు 83మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 103మంది 156 నామినేషన్లు దాఖలు చేశారు.

దక్షిణ ఉపాధ్యాయస్థానం నుంచి వివేకానంద నామినేషన్

దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎన్డీయే అభ్యర్థిగా వివేకానంద నామినేషన్ దాఖలు చేశారు. గురువారం వివేకానంద నామినేషన్‌లో ప్రతిపక్షనేత అశోక్, మాజీ సీఎం కుమారస్వామి, బీజేపీ మైసూరు అభ్యర్థి యదువీర్, జేడీఎస్ కోర్ కమిటీ ముఖ్యులు జీటీ దేవేగౌడ పాల్గొన్నారు. ఇదే స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఇప్పటికే ఈసీ నింగరాజ బుధవారం నామినేషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. నింగరాజుతో బీజేపీ - జేడీఎస్ నేతలు చర్చలు జరిపారు. అనంతరం ఆయనను ఒప్పించిన తర్వాతనే ఉమ్మడి అభ్యర్థిగా వివేకానంద చేత నామినేషన్ దాఖలు చేయించారు.



నామినేషన్ వేస్తున్న వివేకానంద, చిత్రంలో మాజీ సీఎం కుమారస్వామి తదితరులు

టికెట్ అడిగినందుకు టీసీపై దాడి

- అడ్డుకోబోయిన కోచ్ అటెండర్‌ను పొడిచిన దుండగుడు
- అస్పత్రిలో అటెండర్ మృతి..
- చాళుక్య ఎక్స్‌ప్రెస్‌లో దారుణం

బళ్లారి గాంధీనగర్, మే 16: రైలులో ప్రయాణికుడిని టికెట్ అడిగినందుకు దుండగుడు టీసీపై దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన కోచ్ అటెండర్ కత్తి వేటుతో దుర్మరణం పాలయ్యారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురువారం పుదుచ్చేరి-ముంబై మధ్య నడిచే చాళుక్య ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్-8 బోగిలో ఈ ఘటన జరిగింది. రైలు ధారవాడ దాటి బెళగావి వైపు వెళుతున్న సమయంలో గుంజి-ఖానాపురు మధ్యలో టికెట్ కలెక్టర్ అశ్రఫ్ కిత్తూరు టికెట్ చెక్ చేస్తున్నారు. బోగిలో ముసుగు ధరించిన వ్యక్తిని టికెట్ అడుగగా... టికెట్‌ను చూపించకుండా వాగ్వాదానికి దిగాడు. వెంటనే తన వద్ద ఉన్న చాకుతో టికెట్ కలెక్టర్‌పై దాడి చేశాడు. గాయపడిన టీసీని రక్షించేందుకు వెళ్ళిన అటెండర్ దేవకుషి వర్మ(23) ఎదలో నేరుగా చాకుతో పొడవడంతో అటెండర్ కుప్పకూలాడు. పరిస్థితిని గమనించిన తోటి ప్రయాణికులు విడిపించే ప్రయత్నం చేయగా వారిపైనా చాకుతో దాడి జరిపి దుండగుడు రైలుదూకి పారిపోయారు. సాయంత్రం 5గంటలకు రైలు బెళగామ్ రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే బాధితులు నలుగురిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో కోచ్ అటెండర్ దేవకుషి ఆస్పత్రిలో చికిత్స ఫలించక కన్ను మూశారు. నిందితుడు కదులుతున్న రైలు నుండి దూకి పారిపోయినట్లు తెలిసింది. నగర పోలీసు కమిషనర్ ఆయుక్త యడా మార్టిన్ మార్బన్యాంగ్ జిల్లా ఆసుపత్రి, రైల్వే స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతి చెందిన కోచ్ అటెండర్ దేవకుష్ కాంట్రాక్టు బేస్‌పై పనిచేస్తున్నట్లు సమాచారం.



అస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు, చాళుక్య ఎక్స్‌ప్రెస్



రాలిపోయిన అరటి చెట్లు



కూలిన పెంకుటిల్లు




వాన నీటితో నిండిన కొట్టూరు బస్టాండు



బస్టాండ్ ఇలా...

హోరు గాలులు.. జోరు వాన

కంప్లి, మే 16 : ఉక్కపోతతలో అల్లాడుతున్న జనాలకు తొలకరి వానలు ఊరటనిస్తున్నాయి. విజయనగర జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం జోరు వాన కురిసింది. కొట్టూరు తాలుకాలో పలు ప్రాంతాలు వానతో జలమయమయ్యాయి. వర్షంతో పాటు గాలి వాన, పెద్ద పెద్ద పిడుగులు, ఉరుములు, మెరుపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సుమారు గంటకు పైగా వర్షం కురిసింది. కొట్టూరు బస్టాండులో మోకాలి లోతుమేర నీరు నిలిచిపోయింది. పక్కనే వున్న రాజు కాలువ కూడా చెత్తా చెదారంతో నిండిపోయి కొట్టూరు బస్టాండు చుట్టూ మురుగనీటితో నిండి పోయింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హగరి బొమ్మనహళ్లి, మరమ్మనహళ్లిలో చిన్నపాటి గుడిసెలు, రేకుల షెడ్లు గాలివానకు ఎగిరి పోయాయి. సమీప గ్రామాల్లో అరటిచెట్లు నేలరాలాయి. పంటలు నీటి పాలయి రైతులు నష్టాలపాలయ్యారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1577.58	1,578.02
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	1883.00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	0	217.00
సామర్థ్యం (టీఎంసీలు)	3.41	3.58

భత్రి ఈరణ్ణ స్వామి ఆలయంలో చోరీ



సీసీ కెమెరాలో రికార్డయిన దొంగతనం దృశ్యం

బళ్లారిరూరల్, మే 16: నగరంలోని 34వ వార్డు విద్యానగర్ సమీపంలో వున్న భత్రి ఈరణ్ణ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. భక్తులు కానుకలు వేసిన హుండీలోని నగదును దోచుకెళ్లారు. గురువా రం ఉదయం ఆలయ అర్చకులు గుడి తెరవగా హుండీ పగులగొట్టిన విషయాన్ని గమనించి స్థానికులకు, ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా అర్ధరాత్రి గుర్తుతెలియని ఇద్దరు దొంగలు ఆలయంలోకి ప్రవేశించి హుండీలోని నగదును దోచుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ బోల్తా



బోల్తాపడిన కంటైనర్ లారీలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కంప్లి/బళ్లారి సిటీ, మే 16: ఎస్‌హెచ్-50 రహదారిలో కూడ్లిగి-అమలాపురం వద్ద మధ్యాహ్నం వీఆర్ఎల్ సంస్థకు చెందిన కంటైనర్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. కంటైనర్‌లో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న కానాహోసళ్లి ఎస్ఐ మరియప్ప అక్కడకు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు వచ్చి మంటలను ఆర్పి అదుపులోకి తీసుకువచ్చారు.

జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్

కంప్లి, మే 16: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని, పొలాల్లో ఉన్న సమయంలో వర్షంతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని, చెట్ల కిందకు వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ సూచించారు. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు విజయనగర జిల్లాలో ఇద్దరు పిడుగుపాటుకు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని, అలాగే 14 ఇళ్లు, 14 పశువులు మృతి చెందాయన్నారు. జిల్లా పరిధిలోని మరమ్మనహళ్లి, హగరి బొమ్మనళ్లి, కొట్టూరు, కూడ్లిగి, హరప్పనహళ్లి తాలుకాలో అధికారులు కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నష్టపోయిన పంటలు, ఇళ్లు, పశువులు తదితర వాటిపై నివేదిక సిద్ధం చేస్తున్నారన్నారు. త్వరలోనే రైతులకు వారి ఖాతాలో పంటనష్టపరిహారం సొమ్ము జమ చేస్తామన్నారు.

శిశు అభివృద్ధి కార్యాలయాన్ని తొలగించాలి



నిరుపయోగంగా ఉన్న శిశు అభివృద్ధి యోజన కార్యాలయం

సిరుగుప్ప, మే 16: పట్టణంలోని శిశు అభివృద్ధి యోజన కార్యాలయాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సిరుగుప్ప పట్టణంలో పాత శిశు అభివృద్ధి యోజన కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు కూలిపోయింది. గోడలు బీటలువారాయి. గాలివానలకు, వర్షాల తాకిడికి ఎప్పుడైనా కుప్పకూలే పరిస్థితి వుంది. అధికారులు తక్షణమే భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



డెంగీ ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్ బసారెడ్డి



బైక్‌ర్యాలీలో డాక్టర్లు ఆరోగ్య సిబ్బంది తదితరులు

డెంగీ నియంత్రణలో సమాజ పాత్ర కీలకం

- జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి

బళ్లారి సిటీ, మే 16: డెంగీ నియంత్రణలో సమాజ పాత్ర ముఖ్యమని జిల్లా సర్జన్ బసారెడ్డి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా సమాజంతో కలిసి డెంగీని అదుపు చేద్దాం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నగరంలోని జిల్లా ఆసుపత్రిలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారులు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పాలన యంత్రాంగం, పంచాయతీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా అంటు వ్యాధుల నియంత్రణ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీని నిర్వహించారు. ప్రజలతో సన్నిహితంగా ఉండే ప్రభుత్వ-ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు వర్షాకాలం తరువాత డెంగీ నియంత్రణ చర్యలను సమాజస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం అవసరమన్నారు. తద్వారా డెంగీ వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. జిల్లా అంటువ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో ఉన్న వ్యర్థ పదర్థాలను తొలగించాలన్నారు. వర్షపునీటిలో ఏడిస్ దోమలు ఉత్పత్తి కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి జ్వరం వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి సరైన వైద్యం చేయించుకుంటే డెంగీ దరిచేరదన్నారు.

డెంగీ లక్షణాలు: డెంగీ సోకిన ఈడిస్ ఈజిప్టై దోమ కాటు ద్వారా వ్యాపించే స్పెర్మటోజోవా వల్ల వస్తుంది. అకస్మాత్తుగా అధిక జ్వరం, విపరీతమైన తలనొప్పి, కళ్లవెనుక నొప్పి, కండరాలు, కీళ్లలో విపరీతమైన నొప్పి వికారం, వాంతులు ఆకస్మికంగా స్రావం, చిగుళ్లలో రక్తస్రావం సంభవిస్తాయి. ఈ జ్వరాన్ని నిరోధించేందుకు ఎలాంటి వ్యాక్సిన్ అందుబాటులో లేదు. తగిన చికిత్సతో జ్వరాన్ని నయం చేయవచ్చు.

డెంగీ నియంత్రణ చర్యలు: ఇంట్లోని ట్యాంకులు, పీపాలు, డ్రమ్ముల్లోని నీటిని వారానికోసారి ఖాళీ చేసి కడిగి మళ్లీ నింపుకోవాలి. ట్యాంకులు, డ్రమ్ముల్లో వర్షం నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగీ వ్యాధిపై ప్రజలకు అవ గాహన కల్పించేందుకు నగరంలోని అన్ని ప్రధాన వీధులు, వార్డుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగాం అధికారి జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప, జిల్లా లెప్రసీ కంట్రోల్ అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, జిల్లా వీబీడీసీ కన్సల్టెంట్ ప్రతాప్, ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర దాసప్పనవర్ తోపాటు సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ శకుంతల మాలి, నాగరాజు, రవీంద్ర జినాగ, మరిబసవన గౌడ, హెల్త్ ఇన్‌సెంకక్టర్లు అంబుజా, నందిని, శకుంతల లేబొరేటరీ టెక్నికల్ ఆఫీసర్లు, తాలూకా ఆరోగ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో నగరసభ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

రాయచూరు, మే 16: నగరంలో వారం రోజులుగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని తిమ్మాపూర్‌పేట, జహిరాబాద్ సర్కిల్ తదితర కాలనీల ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం ఆందోళన చేపట్టారు. గురువారం ఉదయం నగరసభ వద్దకు వచ్చిన మహిళలు ఖాళీ బిందెలతో నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. వందల సంఖ్యలో తరలి వచ్చిన మహిళల నినాదాలతో నగరసభ పరిసరాలన్ని మార్మోగాయి. అనంతరం మహిళలు అక్కడ నుంచి వెళ్లి జిల్లాధికారి నివాస భవనం వద్ద ధర్నాకు దిగారు. నాలుగు రోజులుగా తాగునీరు రావడం లేదని పైగా అర్ధరాత్రి ప్రాంతంలో నీటిని వదిలినా, 10-15 నిమిషాలకు మించి సరఫరా చేయడం లేదనని మహిళలు వాపోయారు. ఒక దశలో మహిళలు అధికారులపై దూషణకు దిగడంతో వారు మౌనం వహించారు. జిల్లాధికారి నివాసం వద్ద ధర్నాకు దిగిన మహిళలు తమ సమస్యను జిల్లాధికారి దృష్టికి తెచ్చే ప్రయత్నం చేయగా అధికారులు వారికి సర్దిచెప్పి శాంతింపజేశారు.

విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన పోస్టర్‌లను విడుదల చేస్తున్న అధికారులు

రాయచూరు, మే 16: వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలు విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీహెచ్ఓ డాక్టర్ వై.సురేంద్ర బాబు సూచించారు. జాతీయ డెంగీ దినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన జాగృతి జాతాను ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం నిలువ ఉంచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా సహాయాధికారి మహ్మద్ జుబేర్

బళ్లారి గాంధీనగర్, మే 16: నగర శివారు ప్రాంతమైన గుగ్గరహట్టిలో ఉన్న చౌకధాన్యం డిపో పక్కన అక్రమంగా నిలువ చేసిన 750 సంచుల బియ్యాన్ని ఆహార పౌరసరఫరా అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించి సీజ్ చేశారు. ఖచ్చితమైన సమాచారం మేరకు జిల్లా సహాయాధికారి మహ్మద్ జుబేరా, ఆహార పౌరసరఫరా అధికారి షకీనా ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అక్రమంగా నిలువ చేసిన చౌక ధాన్యం డిపో అనుమతిని రద్దు చేయాలని జిల్లా సహాయాధికారి సూచించారు. ఇదే సందర్భంలో బియ్యం రవాణాకు ఉపయోగిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

మస్కిలో పెరుగుతున్న సైబర్ నేరాలు..!

- బ్యాంక్ ఖాతాల్లో రూ.లక్షల దోపిడీ

రాయచూరు, మే 16: జిల్లాలోని మస్కి పట్టణంలో వారం రోజులుగా పెద్ద ఎత్తున సైబర్ నేరాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా బ్యాంక్ ఖాతాలను హ్యాక్ చేయడం ద్వారా పలువురి ఖాతాల్లోని సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచేశారు. శుక్రవారం సెలవుతో పాటు శనివారం రెండో శనివారం కావడం, ఆదివారం వరసగా మూడు రోజులు సెలవులు కావడంతో నిందితులు పెద్ద ఎత్తున నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సమీపంలోని బ్యాంకుల దగ్గరకు వెళ్లి వినియోగదారులు తమ ఖాతాల్లో ఉన్న నగదు లావాదేవీలను తాత్కాలికంగా స్తంభింపచేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురువారం వినియోగదారులకు సూచించారు. పట్టణంలో వారం రోజులుగా 40 కేసులు పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన అధ్యాపకుడు తన ఖాతాల్లో రూ.3.5 లక్షల సొమ్ము మాయమైనట్లు తెలిపారు. మొబైల్ యాప్‌లో వచ్చిన ఒక లింక్‌ను ఆయన ప్రెస్ చేయడంతో ఈ దోపిడీ జరిగినట్లు గుర్తించారు. అలాగే మరో ప్రైవేటు కళాశాలకు చెందిన లెక్చరర్ ఖాతాలో నుంచి రూ.2.25 లక్షల సొమ్ము మాయమైంది. వీరితో పాటు గుడదూరు తదితర గ్రామాలకు చెందిన ఖాతాదారుల నుంచి సొమ్ము మాయం కావడంతో వీటన్నిటికి సంబంధించి 40కి పైగా కేసులు మస్కి పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.75 లక్షలు ఉంటుందని అధికారులు గుర్తించారు.

అంజలి హంతకుడిని శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గంగామాత సమాజం సభ్యులు

గంగావతి రూరల్, మే 16: హుబ్బళ్ళిలోని వీరాపుర వీధికి చెందిన అంజలి అంబిగేరను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గంగామత సమాజం(బెస్త) సంఘం గురువారం తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. సమాజం యువనేత శివకుమార్ అరికేరి మాట్లాడుతూ నేహా హిరేమఠ్ ఘటన మరవక ముందే అంజలి హత్యజరగడం దారుణమన్నారు. అంజలి అంబిగేరను అదేప్రాంతానికి చెందిన గిరీశ్ అనే యువకుడు ప్రేమించమని వేధించేవాడన్నారు. నేహను చంపినట్లు నిన్ను చంపేస్తానని పలుమార్లు ఫోన్ చేసి బెదిరించేవాడని, అంజలి తన అమ్మమ్మతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. మరసటి రోజు ఉదయాన్నే ఇంట్లో దూరి గిరీశ్ చాకుతో దాడి చేసి పరారయ్యాడన్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్ల ఈ ఘటన జరిగిందన్నారు. అంజలి కుటుంబానికి రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని, అవసరమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గంగామాత సమాజం జిల్లాఉపాధ్యక్షుడు పరశురామ,శ్రీనివాస, శ్రీనాథ్, గోపాల్, సిద్దప్ప, హరీష్, మంజునాథ్, వీరేశ్, ధనరాజ్, చంద్రశేఖర, దేవరాజ్, రాజాహుస్సేన్, రఘు, బసవరాజ్, సిద్దు, రంజిత్ ఉన్నారు.

నరేగా పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, మే 16: మహాత్మాగాంధీ ఉచిత హామిపథకం (నరేగా)కింద అమలు చేస్తున్న పనులను జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప గురువారం పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. బళ్లారి తాలూకా భైరదేవనహళ్ళి గ్రామంలో చేపట్టిన సీసీ కాలువ పనులను పరిశీలించి పనుల్లో నాణ్యత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం శివపూర్ గ్రామంలోని ఆటవీశాఖ నర్సరీ క్షేత్రాన్ని సందర్శించారు. మోకాలో వ్యవసాయ గుంతల నిర్మాణాన్ని వీక్షించారు. అనంతరం కారేకట్టు గ్రామంలో వ్యవసాయశాఖ వ్యవసాయ గుంత నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. శిడిగినమోల, మీనహళ్ళి గ్రామాల్లో పాఠశాల ప్రహరీ నిర్మాణం, పరమదేవనహళ్ళి గ్రామంలో శ్మశానవాటిక పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బళ్లారి తాలూకా పంచాతీ కార్యనిర్వహణాధికారి మాదగిన బసప్ప, గ్రామీణ ఉపాధి హామీ పథకం సహాయ పంచాలకులు బసవరాజు, అమలు శాఖ అధికారులు టీఐఈసీ, టీసీ, టీఎంఐఎస్, పీడీఓ, టీఏఈ, డీఈఓ, బీఎఫ్‌టీ, గ్రామకాయక మిత్ర, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు కల్పించాలని కూలీల ధర్నా



ధర్నా చేస్తున్న ఇటిగేహాళ్ గ్రామ వ్యవసాయ కూలీలు

సిరుగుప్ప, మే 16: పనులు కల్పించలేదని ఇటిగేహాళ్ గ్రామ వ్యవసాయ కూలీ కార్మికులు తాలుకా పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిరుగుప్ప పట్టణంలో తాలుకా పంచాయతీ ఎదుట గురువారం ఇటిగేహాళ్ గ్రామ కూలీ కార్మికులు నెల రోజుల నుంచి పనులు కల్పించక సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు కోరల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు యాక్షన్ ప్లాన్ అని, టెక్నికల్ సమస్య అని ఏదో ఒక సాకుచెబుతున్నారని ఎద్దేవా చేశారు. తాలుకా పంచాయతీ మేనేజర్ బసవరాజు స్పందిస్తూ సోమవారం నుంచి కూలీ పనులు కల్పిస్తామని చెప్పారు. దీంతో ధర్నాను విరమించుకున్నారు. ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ముందు రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని కూలీలు హెచ్చరించారు.

ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యేనా?

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కుడితిని వద్ద అర్ధంతరంగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులు

కంప్లి, మే 16: కుడితిని, కురుగోడు రోడ్డు మార్గంలో కుడితిని వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ పనులు ఎనిమిది సంవత్సరాలుగా సాగుతున్నాయి. ఫ్లైఓవర్ పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ఎంతో మంది కర్మాగారాలకు, ఇళ్లకు సరైన సమయానికి చేరలేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో ఎంపీ శాంత హయాంలోనే పనులు ప్రారంభమయ్యాయి. కానీ అప్పటి నుంచి పనులు పూర్తికాక కురుగోడు పట్టణం వైపు నుంచి కర్మాగారాలకు వచ్చే ఉద్యోగులు, గ్రామాల ప్రజలు ఎన్నో సార్లు రైల్వే శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని అధికారులు ప్రజలను మభ్యపెడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు కురుగోడు, కుడితిని భాగాల్లోని ప్రజలు ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని త్వరగా పనులు పూర్తి చేయాలని కుడితిని హిత రక్షణ సమితి అధ్యక్షుడు కామేష్ కోరారు.

గోతిలో పడి ఇద్దరు యువకుల దుర్మరణం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బళ్లారి గాంధీనగర్, మే 16: విజయనగర జిల్లా, హరపనహళ్ళి తాలూకా పరిధి ముత్తిగి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెళుతూ... ప్రమాద వశాత్తు గోతిలో పడి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ముత్తిగి గ్రామం నుంచి మత్తిహళ్ళిని కలిపే రోడ్డులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతిచెందిన ఇద్దరు యువకులు ఒకే గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ప్రమాదంలో మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు చిటగేరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వారిలో ఎన్.శీరనహళ్ళి గ్రామానికి చెందిన నాగరాజు(25), అడివప్ప(25)లుగా గుర్తించారు. బడివాళ బసవరాజు అనే వ్యక్తి గాయపడ్డాడు. ఇతడిని కొట్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బుధవారం అర్ధరాత్రిలో ముగ్గురు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ అదుపు తప్పడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. జిల్లా ఎస్పీ హరిబాబు, డీవైఎస్పీ వెంకప్ప నాయక్, సీపీఐ సాబయ్య ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

తాగిన మత్తులో బేకరి ధ్వంసం

రాయచూరు, మే 16: తప్ప తాగి వచ్చిన యువకులు కొందరు బేకరిలో విధ్వంసం సృష్టించి, యజమానితో పాటు పనిచేసే వారిపై దాడికి దిగిన సంఘటన జిల్లాలోని లింగసుగూరు పట్టణంలో చోటు చేసుకుంది. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై స్పందించిన పోలీసులు గురువారం బేకరి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులు ఎవ్వరన్నది తమకు తెలియదని కాని వారిని గుర్తుపడతామని యజమాని చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తాగిన మత్తులో బేకరి దగ్గరికి వచ్చిన యువకులు తమకు తినేందుకు కొన్ని ఐటమ్స్ కావాలని కోరగా ఉన్నవి ఇచ్చిన వారు మిగిలినవి స్టాక్ లేదని చెప్పడంతో ఆగ్రహించి ధ్వంసానికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన సిబ్బందిని కొట్టడమేగాక బేకరిలో షోకేస్‌ను ధ్వంసం చేశారు. దాదాపు రూ.10 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని యజమాని పోలీసులకు వివరించారు. లింగసుగూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

పశువులను సంరక్షించండి

హోసూరు(కృష్ణగిరి) మే 16: కృష్ణగిరి జిల్లాలో వేసవి తాపం మండిపోతోందని, ఎండవేడిమి నుంచి పశువులను సంరక్షించాలని యజమానులకు జిల్లా కలెక్టర్ సరయు సూచించారు. అధిక వేడి సమయంలో మేతకు తీసుకెళ్లరాదని, జంతువులను ఎండల్లో ఎక్కువ దూరం తీసుకెళ్లకూడదు, చెట్ల నీడలో వదలి పెట్టాలన్నారు. తెల్లవారుజామున సాయంత్రం వేళల్లో పశువులను గాలితో కూడిన ఎత్తైన షెడ్లలో ఉంచాలన్నారు. అలాగే పశువులకు అన్నం గంజి నివారించాలన్నారు. తగినంత స్వచ్ఛమైన నీరు అందించాలని సూచించారు. సాయంత్రం పచ్చి మేత ఇవ్వాలని, రోజూ 40 గ్రాముల ఖనిజ లవణ మిశ్రమాన్ని తాగించాలన్నారు. రోజుకు మూడు సార్లు చల్లటి నీరు పెట్టాలన్నారు. షెడ్ దాని పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, దీంతో ఈగల వ్యాప్తి తగ్గుతుంది. అలాగే వేసవి కాలంలో కోళ్లకు ఉదయం రాత్రి వేళల్లో ఆహారం ఇవ్వాలన్నారు. మేకలకు సకాలంలో టీకాలు వేయడానికి రోజుకు కనీసం 6 నుంచి 12 లీటర్లు నీరు తాగించాలన్నారు. ఈ పద్ధతులు పాటించడం వల్ల పశువులు ఎండ నుంచి ఉపశమనం పొందుతాయన్నారు.

హోసూరు జోన్

మందుబాబుల నుంచి రక్షణ కల్పించండి

హోసూరు మే 16: నగర సమీపంలో కొందరు మద్యం సేవించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు. హోసూరు సమీపం జాతీయ రహదారికి ఇరువైపులా మద్యం దుకాణాలు ఉన్నాయి. దుకాణాలకు నిత్యం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పలువురు మద్యం ప్రియులు వస్తుంటారు. కొందరు దుకాణం దగ్గర మద్యం సేవించి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారిపై చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి, సేలం తమిళనాడులోని ఇతర ప్రాంతాల నుంచి కూడా కేరళ చేరుకోవచ్చు. కేరళ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వాహనాలు ఈ జాతీయ రహదారిపై వివిధ రాష్ట్రాలకు వెళ్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని అత్తిపల్లి ఆర్చ్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పలు మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో నివసించే చాలా మంది మద్యం మత్తులో మార్గమధ్యలో నడుచుకుంటూ వెళ్లడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది భారీ వాహనాలను ఆపి వాటిని కదలనీయకుండా చేస్తున్నారు. పోలీసులు తక్షణం స్పందించి మద్యం ప్రియులను తమను కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.



రాష్ట్ర సరిహద్దులో మద్యం సేవించి వాహనాలను అడ్డుకంటున్న మందుబాబు

సంప్రదాయ వ్యవసాయంపై విద్యార్థులకు శిక్షణ

హోసూరు మే 16: సంప్రాయ వ్యవసాయంపై వ్యవసాయ సహాయక సంచాలకులు జాన్ లూర్ద్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శూలగిరి వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హరిణి, గ్రామీణ వ్యవసాయం, శిక్షణ కార్యక్రమం కింద జానవిక, ఆర్.కార్తీక, టి. కయల్‌విజి, ఎస్. కావ్య, మహి, శూలగిరి ప్రాంతంలోని విద్యార్థులు జిల్లాలోని గ్రామాలను సందర్శించి అక్కడి రైతులతో సంప్రదాయ, సాంకేతిక వ్యవసాయ విధానం, వారు అనుసరించే పంటల పథకాలను వివరించాలని సహాయ సంచాలకులు సూచించారు. కళాశాలలో నేర్చుకున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యంత్రాల గురించి రైతులకు ప్రదర్శనలు ఇవ్వాలన్నారు. ఇందులో భాగంగా మారండపల్లిలోని అమినో యాసిడ్ అగ్రికల్చర్ విద్యార్థులు ఈ విధానాన్ని పరిశీలించారు. గుడ్డు, గులాబీ రసం, దేశీ పంచదార వాడటం వల్ల మొక్క ఎదుగుదల పెరుగుతుందని, భూసారం పెరుగుతుందని, పండ్ల సంఖ్య పెరుగుతుందని వివరించారు.



గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

హోసూరులో తాగునీటికి కటకట



కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

హోసూరు మే 16: నగరంలో మూడు నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మహిళలు గురువారం నిరసన తెలిపారు. హోసూరు అన్నానగర్‌లో 2 నెలల పాటు తాగునీటి సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ కమిషనర్ స్పందించి శాంతి చర్చలకు రాకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే చర్యలు తీసుకుని తాగునీరు అందిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

శాంతకుమారి (జయంతి)




అలనాటి గొప్ప నటీమణులలో ఒకరైన శాంతకుమారి 1920 మే 17న కడప జిల్లా ప్రొద్దుటూరులో జన్మించారు. అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. 1936లో 'శశిరేఖా పరిణయం' ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టి 250 సినిమాలలో నటించారు. దర్శకుడు పీ పుల్లయ్య సతీమణి. శాస్త్రీయ సంగీతంలోనూ, వయోలిన్‌లోనూ రాణించి 16వ యేటకే ఆలిండియా రేడియో ద్వారా గుర్తింపు పొందారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ వంటి ప్రముఖులతో నటించారు. సారంగధర, ధర్మపత్ని, కృష్ణప్రేమ, షావుకారు, జయభేరి, ప్రేమనగర్ తదితర సినిమాలు ఎంతో గుర్తింపునిచ్చాయి. సినిమాలలో నటించడం మానేసిన తర్వాత మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడే పాటలను రాసి, స్వరపరిచేవారు. రఘుపతి వెంకయ్య, కళా నీరాజన వంటి పురస్కారాలు పొందారు. 2006 జనవరి 17న కన్నుమూశారు.

బీఎస్ చంద్రశేఖర్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత భగవత్ సుబ్రమణ్య చంద్రశేఖర్ 1945 మే 17న మైసూరులో జన్మించారు. క్రికెట్‌లో లెగ్ స్పిన్నర్‌గా రాణించారు. చంద్రశేఖర్, ఈఏఎస్ ప్రసన్న, బిషన్‌సింగ్ బేడి, శ్రీనివాస వెంకటరాఘవన్‌లతో కలసి 'ఇండియన్ స్పిన్ క్వార్టెట్'గా పేరొందారు. 1964లో ఇంగ్లండ్‌పై జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో 4 వికెట్‌లు సాధించారు. 1971లో 38 పరుగులకు 6 వికెట్‌లు సాధించి ఉత్తమ బౌలర్‌గా గుర్తింపు పేరొందారు. 16ఏళ్ల కెరీర్‌లో 58 టెస్ట్ మ్యాచ్‌లలో 242 వికెట్‌లు తీశారు. 1972లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. విజ్‌డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, అర్జున అవార్డు ఇతర పురస్కారాలు పొందారు.

పంకజ్ ఉదాస్ (పుట్టినరోజు)



పంకజ్ ఉదాస్ 1951 మే 17న గుజరాత్ రాష్ట్రం జెత్పూర్‌లో జన్మించారు. గజల్ గాయకుడిగా పేరొందారు. నేపథ్య గాయకుడిగాను రాణించారు. 50కుపైగా ఆల్బమ్స్ విడుదల చేశారు. 100కుపైగా ఆల్బమ్స్ రూపకల్పన చేశారు. ఉత్తమ గజల్ గాయకుడిగా కేఎల్ సైగల్ అవార్డు అందుకున్నారు. గాయకుడిగా 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 2006లో అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం నుంచి 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. దాదాభాయ్ నౌరోజీ స్మారక పురస్కారం, ఇతర అవార్డులు పొందారు.

కేంద్రపథకాలను వేగవంతం చేయండి

● లబ్ధిదారులకు త్వరగా చేరేలా చూడాలి ● బ్యాంకర్ల సమావేశంలో ప్రభుత్వ అదనపు ముఖ్యకార్యదర్శి శాలినీ రజనీష్

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనా, ప్రధానమంత్రి సురక్షా పథకాల లబ్ధిదారులకు త్వరితగతిన పథకాలను అందించాలని రాష్ట్రప్రభుత్వ అదనపు ముఖ్యకార్యదర్శి, డెవలెప్‌మెంట్ కమిషనర్ శాలిని రజనీశ్ పిలుపునిచ్చారు. కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో 165వ స్టేట్‌లెవెల్స్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం (ఎస్ఎల్‌బీసీ) విధానసౌధలో బుధవారం జరిగింది. రిజర్వుబ్యాంకు రీజనల్ డైరెక్టర్ సోనాలిసేన్ గుప్త, నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ రమేశ్, కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేంద్రకుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, కెనరాబ్యాంకు సీజీఎం కేజే శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 78.19శాతం అన్నిబ్యాంకులు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై అమలు చేశాయని కెనరాబ్యాంకు ఈడీ వివరించారు. గత ఆర్థికసంవత్సరంలో వ్యవసాయరంగానికి 104శాతంతో అన్నివిధాలా బ్యాంకులు లక్ష్యాలను అధిగమించాయన్నారు. రుణాలకు సంబంధించి 114శాతం ప్రాధాన్యత పరంగా 97శాతం ప్రగతిసాధ్యమైందన్నారు. విద్యారంగంలో 25శాతం, అవసరాలకు సంబంధించి 26శాతం సాధ్యమైనట్టు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరును విజయవంతంగా ప్రారంభించింది పాన్ ఇండియా స్థాయిలో కర్ణాటక ఉందని అదనపు చీఫ్ సెక్రటరీ శాలిని కొనియాడారు. అన్ని బ్యాంకుల మేనేజర్‌లు, ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రప్రభుత్వ అదనపు ముఖ్యకార్యదర్శి శాలిని రజనీశ్

ఐదు అస్తిపంజరాల కేసు ఛేదింపు

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్రదుర్గ శివారులో పాడుబడిన ఇంట్లో గత ఏడాది డిసెంబరులో ఒకే ఇంట్లో ఐదు అస్తిపంజరాల కేసును పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ ధర్మేంద్రకుమార్ మీనా గురువారం మీడియాతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించి 71 సాక్షాలను సేకరించి ల్యాబ్‌కు పంపించామన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలాన్ని పరిశీలించారని డాక్టర్ వేణుశ్రీకృష్ణ నేతృత్వంలో పోస్టుమార్టం జరిగిందన్నారు. ఐదు ఆస్తిపంజరాలలోనూ డ్రగ్స్‌కు సంబంధించిన అంశాలు లభించాయని నిద్రమాత్రలు మింగి మృతి చెంది ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ఇంట్లోని వంటగదిల పాత్రలలో సైనైడ్‌కు సంబంధించిన గుర్తులు లభించాయని అయితే అస్తిపంజరాలలో మాత్రం లభ్యం కాలేదన్నారు. ఇంట్లో మాత్రలు, ఇతర మందులు చిక్కాయన్నారు.



ఎస్పీ ధర్మేంద్రకుమార్ మీనా

యూనియన్‌బ్యాంక్ ఎంఎస్ఎంఈ శాఖ ప్రారంభం

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వ్యాపార, వాణిజ్య రంగాలలో ప్రగతిపరంగా దూసుకెళుతున్న బెంగళూరు వాసుల కోసం యూనియన్ బ్యాంక్‌చే సూక్ష్మ, చిన్న మధ్యమ తరహా(ఎంఎస్ఎంఈ) ప్రత్యేక బ్యాంకు శాఖను లాంఛనంగా ప్రారంభించారు. నగర పరిధిలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా గుర్తింపు కలిగిన శాఖ ఏర్పాటు ద్వారా మరింత మంది పారిశ్రామిక వేత్తలకు అనుకూలం కానుందని యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేష్ రంజన్ అభిప్రాయపడ్డారు. గురువారం యూనియన్ బ్యాంక్ సెంట్రల్ ఆఫీస్ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రవీణ్ శర్మతో పాటు బ్యాంకు ముఖ్య అధికారులు, పారిశ్రామిక వాడలోని పలువురు పారిశ్రామిక వేత్తలు భాగస్వామ్యులయ్యారు. ఈడీ నితేష్ రంజన్ మాట్లాడుతూ పీణ్య పారిశ్రామిక వాడలో వేలాది పరిశ్రమలు ఉన్నాయని ఇదే ప్రాంతంలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారితో పాటు ప్రస్తుతం ఉండే పరిశ్రమలను అభ్యున్నతి చేసుకోదలచిన వారికి ఎంఎస్ఎంఈ శాఖ అనుకూలం కానుందన్నారు. పీణ్య వాసులకే కాకుండా వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు సులభతరంగా రుణాలు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. వేగవంతంగా రుణాలు మంజూరు చేసేందుకు ఎస్‌టీపీ(స్ట్రైట్ త్రో ప్రాసింగ్)ను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌లు నవనీత్ కుమార్, బెంగళూరు జోనల్‌హెడ్ రాజేందర్ కుమార్ నార్త్ రీజనల్ హెడ్ శ్రీకాంత్‌వర్మలు పాల్గొన్నారు. అనంతరం పారిశ్రామిక వేత్తలతో ప్రత్యేక సమావేశం జరిపారు.



పీణ్యాలో యూనియన్‌బ్యాంక్ ఎంఎస్ఎంఈశాఖను ప్రారంభిస్తున్న ఈడీ తదితరులు

పీఈఎస్ ప్రవేశ పరీక్షల్లో రిషిజైన్‌కు మొదటి ర్యాంకు



రిషిజైన్



సృజన్‌కుమార్



పల్లెనేని శ్లోక



కనిష్క సరాఫ్



ఆదిత్య వత్స

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికై జాతీయస్థాయిలో నిర్వహించిన పీఈఎస్ అడ్మిషన్ టెస్ట్ (పెసాట్) లో రాజస్థాన్ రాష్ట్రం కోటకు చెందిన నలంద అకాడమీ విద్యార్థి రిషిజైన్ మొదటి ర్యాంకు సాధించారు. గురువారం పీఈఎస్ యూనివర్సిటీలో 2024-25 అడ్మిషన్ టెస్ట్‌లకు సంబంధించిన ర్యాంకులను విడుదల చేశారు. ఏప్రిల్ 20 నుంచి మే 12వరకు జాతీయస్థాయిలో పరీక్షలు జరిగాయని, మొత్తం 26వేలమంది విద్యార్థులు భాగస్వామ్యులైనట్టు ప్రకటించారు. 44 కేంద్రాలలో పరీక్షలు ఆన్‌లైన్ ద్వారా జరిపామన్నారు. రాజస్థాన్ రాష్ట్రం కోట ప్రాంతానికి చెందిన లాల్‌బహదూర్‌శాస్త్రి విద్యాసంస్థ సృజన్‌కుమార్ రెండో ర్యాంకును సాధించారు. అనంతపురంనకు చెందిన ప్లాస్మా అకాడమీ విద్యార్థిని పల్లెనేని శ్లోక మూడోర్యాంకును, రాజస్థాన్ రాష్ట్రం కోటలోని అలెన్ అకాడమీ విద్యార్థిని తనిష్కా సరాఫ్ నాల్గోర్యాంకును, బెంగళూరు వైట్‌ఫీల్డ్ శ్రీరామ్ గ్లోబల్‌స్కూల్ విద్యార్థి ఆదిత్యవత్స ఐదోర్యాంకును, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవ్‌లోని సిటీ మాంటిస్సోరి స్కూల్ ఆరోహి జైస్వాల్ ఆరో ర్యాంకును, బెంగళూరు జ్ఞాన భారతి సెయింట్ ఫిలోమినా కళాశాల జ్ఞానసాగర్ హెచ్ ఏడోర్యాంకును, హైదరాబాద్ శ్రీచైతన్య విద్యార్థిని కుసుపాటి ప్రశాంతి ఎనిమిదోర్యాంకును, హనుమంతనగర్ పీఈఎస్ కళాశాల ప్రద్యుత్ కేఎం తొమ్మిదోర్యాంకును, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సహరాపుర లార్డ్‌మహావీర్ అకాడమీ ఆదిత్యసింఘాల్ పదోర్యాంకును సాధించారన్నారు. అడ్మిషన్లు ఈనెల 25, 26తేదీలలో యూనివర్సిటీలో కౌన్సెలింగ్, సీట్ సెలెక్షన్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి ప్రత్యేకంగా అభినందించారు.



ఉత్పత్తుల ప్రాముఖ్యతను వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

గృహోపకరణాల ఎలక్ట్రానిక్స్ విభాగంలోకి ఏసెర్

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఐటీ దిగ్గజ సంస్థ ఏసెర్ గ్రూప్ సరికొత్తగా గృహోపకరణాల ఎలక్ట్రానిక్స్ విభాగంలోకి ప్రవేశించింది. నగరంలో ఏసెర్‌ప్యూర్ బ్రాండ్‌ను లాంఛనంగా విడుదల చేసింది. టీవీలు, వాటర్ ప్యూరిఫయ్యర్, ఎయిర్ సర్క్యులేటర్ ఫ్యాన్స్, వాక్యూమ్ క్లీనర్స్, పర్సనల్ కేర్ ఉత్పత్తులు తదితర రకాలను విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. సంస్థ పాన్ ఏసియా పసిఫిక్ ఆపరేషన్స్ అధ్యక్షుడు ఆండ్ర్యూ హౌ, ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్ కోహ్లి, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సుధీర్ గోయెల్, అధ్యక్షుడు స్టాన్లీ కావ్ తదితరులు పాల్గొన్నారు. 32, 43, 55, 65 అంగుళాల టీవీలను విడుదల చేశారు. ఓఎల్ఈడీ టీవీ, మిని ఎల్ఈడీ టీవీ, గేమింగ్ టీవీ వంటి సదుపాయాలు కలవన్నారు. కాగా హెయిర్ డయ్యర్, హెయిర్ స్ట్రైలర్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషనర్స్, వాషింగ్ మిషన్స్ ఇతరత్రా అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు.

పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

బంగారపేట, మే 16: చెన్నై కారిడార్ రోడ్డు పనులు చేస్తున్న కంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం కాంరణంగా టిప్పర్ లారీలనుంచి వెలువుడుతున్న ధూళితో పంటలను నష్టపోతున్నారని వెంటనే తగిన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. రైతుల పేరిట నకిలీ రికార్డులు సృష్టించి కోట్లాదిరూపాయల పంట పరిహారాన్ని లూటీ చేసిన చెన్నై కారిడార్ కంట్రాక్టర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 48 గంటల గడువు ఇస్తున్నామని హెచ్చరించారు. వాణిజ్యపంటలకు ప్రతి ఎకరాకు రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెన్నై కారిడార్ రోడ్డు అభివృద్ధి కోసం భూస్వాధీనం వేళ రైతులకు పరిహారం కోసం ఇచ్చిన దాఖలాలను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. మాలూరు నుంచి ముళబాగలు సరిహద్దు వరకు 100 కోట్ల రూపాయల పంటనష్ట పరిహారాన్ని స్వాహా చేశారని ఆరోపించారు. కొంతమంది అధికారులు రైతులపేరిట వంచనకు పాల్పడ్డారన్నారు. కరువు పరిస్థితుల్లోనూ లక్షలాదిరూపాయల ఖర్చుతో క్యాప్సికమ్, పూలు, పట్టు, టమోటా పంటలు సాగు చేసినా పలు కారణాలతో నష్టపోయారన్నారు. దీనికితోడు వాహనాలనుంచి వెలువడిన ధూళి మరో సమస్యగా మారిందన్నారు. సతీశ్‌గౌడ, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్ళి మంజునాథ్‌లు మాట్లాడుతూ రోడ్డుకు 200 మీటర్ల పరిధిలో పంటలు నష్టపోకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు ఉన్నా పాటించలేదన్నారు. నిరసనలో మంగసంద్ర తిమ్మణ్ణ, గిరీశ్, శివారెడ్డి, పుత్తేరి రాజు, మరగల్ మునియప్ప, శైలజ, రత్నమ్మ, వెంకటమ్మ, గౌరమ్మ, సుప్రీం చల తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న రైతులు

గెలుపు లెక్కలపై నేతల సమీక్ష

కళ్యాణదుర్గం, మే 16: పోలింగ్ ముగిసింది. ఫలితం ఈవీఎం మిషన్లో నిక్షిప్తమైంది. ఫలితానికి 18 రోజులు నిరీక్షించాలి. నేతలంతా 56 రోజులపాటు తీరిక లేకుండా గడిపారు. వ్యూహాలు, ప్రతి వ్యూహాలు పన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కూటమి, వైసీపీ, కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఓటింగ్ ప్రక్రియ ముగియడంతో గెలుపుపై ఆరా తీస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా లెక్కలు వేస్తున్నారు. పోలింగ్ ఎలా జరిగింది..? ఏ వర్గం వారు ఎటు వైపు ఉన్నారు..? తదితర విషయాలపై చర్చిస్తున్నారు.

రూ. కోట్లలో ఖర్చు..

టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ప్రధాన పోటీ జరిగింది. ఎన్నికల్లో ఖర్చుకు ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. సభలను విజయవంతం చేసేందుకు అభ్యర్థులు రూ. కోట్లల్లో ఖర్చు చేశారు. ప్రచారానికి, డీజే, టెంట్ తదితరాలకు భారీగానే ఖర్చుచేశారు. సోషల్ మీడియాలో ప్రచారానికి ప్రత్యేకంగా కొందరిని నియమించి అవి మరీ వైరల్ అయ్యేలా పావులు కదిపారు. ఎన్నికల ముందు రెండు రోజులపాటు ఓటుకు రూ. రెండు వేలు నుంచి రూ. 2500ల వరకు పంపిణీ చేసినట్లు సమాచారం. వైసీపీ నేతలు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది.

ఆకట్టుకున్న సూపర్‌సిక్స్

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈసారి అభివృద్ధి దిశగా ఓటర్లు ముందుకు కదలినట్లు తెలుస్తోంది. ల్యాండ్ టైటిలింగ్‌పై ప్రజల్లో అసంతృప్తి, భయాందోళన కూడా ఓటింగ్ పెరగడానికి కారణమైంది. గత ఐదేళ్లలో రైతులకు బిందు సేద్యం పరికరాలు ఇవ్వకపోగా తప్పుల తడకగా భూసర్వేలు చేయడంలో పలువురు రైతులు అసంతృప్తితో వున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో రైతులు తమ విలువైన భూములను కోల్పోవాల్సి వచ్చిందని, ఆ భూసర్వేతోనే తీవ్ర ఆందోళనతో వుంటే ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరిట మరో దారుణమైన చట్టాన్ని తెరపైకి తెచ్చారని అంతా భగ్గుమంటున్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని ఇవ్వకపోవడం, మెగా డీఎస్సీ ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు వారి అసహనాన్ని ఎన్నికల్లో ప్రదర్శించారన్నారు. అన్ని వర్గాలను సంతృప్తి పరిచే విధంగా వున్న టీడీపీ మేనిఫెస్టోపై ఎక్కువమంది మొగ్గుచూపినట్లు తెలుస్తోంది.

కూటమి నేతల్లో పెరిగిన జోష్

2014, 2019 ఎన్నికలతో పోలిస్తే 2024 ఎన్నికల్లో ఎక్కువ శాతం మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో కూటమి నేతల్లో జోష్ పెరిగింది. జిల్లాలో కళ్యాణదుర్గం నియోజకవర్గం 89.69 శాతం ఓటింగ్ జరిగి రెండవ స్థానాన్ని దక్కించుకుంది. ప్రభుత్వ వ్యతిరేకతతో ఎక్కువ మంది ఓటింగ్‌కు తరలివచ్చినట్లు తెలుస్తోంది. ఇది తమకు లాభం చేకూర్చే అంశమని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి కళ్యాణదుర్గంలో కూటమి గెలుపు దిశగా అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు నిశ్శబ్ద తీర్పు ఇవ్వబోతున్నారని, జూన్ 4న అనూహ్య ఫలితాలు చూస్తామని చెబుతున్నారు. మరోవైపు వైసీపీ నేతలు పెరిగిన ఓటింగ్ శాతం ప్రభుత్వ అనుకూలతకు తార్కాణమని అంటున్నారు. ఎవరి అంచనాలు నిజమవుతాయో తెలియాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.



అరుణాచలానికి ప్రత్యేక బస్సు

రాయదుర్గంరూరల్, మే 16: రాయదుర్గం నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీన ఉదయం 5 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. పెద్దలకు రూ. 1950, పిల్లలకు రూ.1020గా ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా 18వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

హజ్ యాత్రపై అవగాహన

గుంతకల్లుటౌన్, మే 16: పట్టణంలోని అంజుమన్ వీధిలోని అంజుమన్-ఏ-ఇస్లామీయా కార్యాలయంలో గురువారం హజ్ యాత్రపై అవగాహన కల్పించారు. హాఫిజులు ఖలీలుల్ రహెమాన్, ఇస్మాయిల్, మన్నన్‌సాబ్ హజ్ ఆచరణ గురించి వివరించారు. అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రాజస్థాన్ వాసి మృతి

పావగడ, మే 16: పట్టణంలోని వేణుగోపాలస్వామి వీధిలో ఉన్న స్వీట్ దుకాణ వ్యాపారస్తుడు పార్సీలాల్(45) అనేవ్యక్తి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పార్సీలాల్ 13 సంవత్సరాలుగా పావగడ పట్టణంలో స్వీట్ దుకాణం ద్వారా జీవనం గడిపేవారు. ఎప్పటిలాగే గురువారం కూడా తన తోపుడు బండిలోని బ్యాటరీకి చార్జింగ్ పెట్టడానికి వెళ్లిన సమయంలో అకస్మాత్తుగా విద్యుదాఘాతం జరగడంతో మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బంధువుల సమాచారం మేరకు కేసు నమోదుచేసి మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ సురేష్ తెలిపారు



పార్సీలాల్(ఫైల్)

రామయ్య ఆసుపత్రిలో కేన్సర్‌కు అత్యాధునిక చికిత్స

బెంగళూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామయ్య మెమోరియల్ ఆసుపత్రిలో కేన్సర్ బాధితుల జీవన ప్రమాణాన్ని పెంచేందుకు కొత్త చికిత్సా విధానం నోవెల్ ఇంట్రా ఆపరేటివ్ రేడియేషన్ థెరపీని అందుబాటులోకి తెచ్చినట్టు గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (మెడికల్) డైరెక్టర్ డాక్టర్ ఎంఆర్ జయరాం అభిప్రాయపడ్డారు. గురువారం మెమోరియల్ ఆసుపత్రిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కేన్సర్ బాధితులు 13.5శాతం పెరుగుతున్నాయని వీటిలో 10శాతం మృతి చెందుతున్నారన్నారు. మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్ ఆందోళనకరం అనిపిస్తోందన్నారు. 25.32శాతం మంది ప్రధాననగరాలలోనే ఉన్నారని అభిప్రాయపడ్డారు. డిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌లలో అత్యధికమని విచారం వ్యక్తం చేశారు. 2025 నాటికి 29.8శాతం పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజిస్ట్ డైరెక్టర్ డాక్టర్ హరి, హెచ్ఓడీ కృతి కౌశిక్‌ల అభిప్రాయం మేరకు రామయ్య ఆసుపత్రిలో కేన్సర్‌ను గుర్తించి చికిత్సలు అందించే అత్యాధునిక విధానాలను కేన్సర్‌కు మూడు రకాల రేడియేషన్ థెరపీ కల్పిస్తున్న ఏకైక ఆసుపత్రి అన్నారు. లినాక్ ట్రూబీమ్స్ ఎలక్ట్రా ఎక్స్‌టర్నల్ రేడియేషన్ థెరపీ, సజినోవా బ్రాకీ థెరపీ, ఐఓఆర్‌టీ చికిత్సా విధానాలు అందుబాటుతో మల్టిస్పెషాలిటీ ఆసుపత్రిగా ఉందన్నారు. ఇటీవల ఇరువురు మహిళలకు ఐఓఆర్‌టీ చికిత్సల ద్వారా విజయవంతమైన అంశాన్ని ప్రస్తావించారు. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో సైడ్ ఎఫెక్ట్ లేని చికిత్సా విధానమన్నారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఆర్ శ్రీనివాసమూర్తి, రామయ్య స్మారక ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ నాగేంద్రస్వామి, డైరెక్టర్ డాక్టర్ హరీశ్, మదన్‌గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన యూనిట్ ప్రారంభిస్తున్న ఆస్పత్రి ముఖ్యులు